

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

### ప్రజలకు అందుబాటులో ఉంటూ..

## సమస్యల పరిష్కరిస్తున్నాం

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మే 16 : నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ , మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం , దుందిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల సభ్యులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే శుభకార్యక్రమాల వేడుకల్లో పాల్గొనాలని పలువురు రాజుకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

## సీబీఎస్ఈ పరీక్షల్లో సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

సూరారం, మే 16: సీఎంఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు – AISSE (10వ తరగతి), AISSCE (12వ తరగతి)లో అసాధారణ ఫలితాలను సాధించింది.12వ తరగతిలో బైపీసీ స్ట్రీమ్‌లో మామిడిచెట్ల స్ఫూర్తి 89.2%తో స్కూల్ టాపర్‌గా నిలిచింది. అలాగే 10వ తరగతిలో టాటా వెంకటరాఘవ సుదీప్ 97.6% సాధించి టాపర్‌గా నిలిచాడు. 10లో అనేక మంది విద్యార్థులు 90% కి పైగా మార్కులు సాధించి స్కూల్ అకామిక్ టాపర్లుగా మెరిశారు. 10,12వ తరగతుల అకామిక్ టాపర్లను శాసనసభ్యులు మల్లారెడ్డి మెంటోలతో సత్కరించారు. టాపర్లకు గర్వకారణమైన తల్లిదండ్రులు, అధ్యాపకులు ఈ వేడుకలో పాల్గొనడం అభినం దనీయమన్నారు.

## ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిజాయితీ




ప్రయాణికురాలికి బ్యాగును అప్పగిస్తున్న ఆర్టీసీ అధికారులు

మియాపూర్, మే 16 : మియాపూర్–2 డిపోకు చెందిన పుష్పక్ ఎయిర్పోర్ట్ బస్సులో గురువారం ఓ మహిళా ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును శుక్రవారం డిపోలో అధికారులు అందజేశారు. సదరు మహిళ పోగొట్టుకున్న బ్యాగులో రూ.ఎనిమిది లక్షల విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులను ప్రయాణికురాలికి అందించారు. ఈ సందర్భంగా బస్సు డ్రైవర్‌ను ఆర్టీసీ అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ అపర్ణ కళ్యాణి , డిపో మేనేజర్ వెంకటేశం సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్, మే 16: మరమ్మతుల కారణంగా నేడు పేట్ బషీరాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుండి 10:00 వరకు 11KV బజరంగ్ హిల్స్ స్కూల్ ఫీడర్ పరిధిలో బజరంగ్ హిల్స్ ప్రాంతం, వెంకటేశ్వర కాలనీ, సర్వోతం కంపెనీ ప్రాంతం, ఉదయం 10:00 నుండి 10:30 వరకు 11KV ప్రగటూల్స్ ఫీడర్ పరిధిలో ప్రగటూల్స్ కాలనీ, BHEL విస్టా, లక్ష్మీ గంగా ఎన్క్లేవ్, శాంత శ్రీరామ్ అపార్ట్‌మెంట్లు, GLR ఎంక్లేవ్, ఉదయం 10:30 నుండి 11:00 వరకు 11KV GBR క్లబ్ ఫీడర్ పరిధిలో GBR క్లబ్ ప్రాంతం, దూలపల్లి ఎదురుగా ఉన్న ప్రాంతం ప్రధాన రహదారి ప్రాంతం, 10:30 నుండి ఉదయం 11:00 గంటలకు 11KV ఫెయిర్‌మాంట్ ఫీడర్ పరిధిలో ఫెయిర్‌మౌంట్ వాణిజ్య ప్రాంతంలో కరెంటు సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

## హైటెక్ సిటీలో కారులో మంటలు



మంటల్లో కాలుతున్న కారు

కొండాపూర్, మే 16 : నడుస్తున్న కారు ఇంజన్లో మంటలు చెలరేగి ముందు భాగం కాలిపోయిన సంఘటన హైటెక్ సిటీ ఐటీ కారిడార్ లో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. సైబర్ టవర్ నుంచి బయోడైవర్సిటీ వైపు వెళ్తున్న రెనాల్ట్ ట్రైబర్ కారు (టీఎస్09జిపి7765) రాయదుర్గం మెట్రో స్టేషన్ వద్ద ఉన్న మైండ్ స్పేస్ ఎంట్రీ జంక్షన్ వద్దకు రాగానే ఇంజన్లో నుండి ఒక్కసారిగా మంట లు చెలరేగాయి. అప్రమత్తమైన కారు నడుపుతున్న వ్యక్తి వెంటనే బయటకు దిగాడు. సమాచారం అందుకున్న మాదాపూర్ ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో కారు సగం వరకు కాలిపోయింది. ఈ అగ్ని ప్రమాదం కారణంగా సైబర్ టవర్ నుంచి మైండ్ స్పేస్ వరకు భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు మంటల్లో కాలిపోయిన కారును పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

### సమస్యలు పరిష్కరించేందుకు

## నిధులు కేటాయించాలి

- వరద నీటి ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి
- వర్షాకాలంలోపు... కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలి
- జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరిన ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు



జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు నియోజకవర్గంలోని సమస్యలు తెలుపుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 16: వర్షాకాలానికి ముందే వరద నీటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని, ఈ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులను కేటాయించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్లు మందడి శ్రీనివాస రావు, సబీహ గౌసిద్దీన్, ఆవుల రవీందర్ రెడ్డి, పం డాల సతీష్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు పగుడా ల బాబురావు, మాధవరం రంగారావులతో కలిసి ప్రజా సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి పనులను చేపట్టేందుకు నిధులను మంజూరు చేయాలన్నారు. ప్రధానంగా బాలానగర్, ఫతేనగర్ అల్లాపూర్, బాలాజీనగర్, కేపీహెచ్‌బీ కాలనీలలో చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని ఈ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా డివిజన్లో వరద నీటి కాలువ నిర్మాణ పనులు సగంలోనే ఆగిపోయాయని, ఈ పనులను పూర్తి చేసేందుకు నిధులను కేటాయించాలన్నారు. రానున్న వర్షాకాలంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఫతేనగర్ ఆర్‌ఓబీ నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు నిధులను కేటాయించాలని కోరారు. నిధుల కొరత పేరు తో గతంలో చేపట్టిన పలు పనులు పెండింగ్లో ఉన్నాయని వాటిని సత్వరమే చేపట్టి పూర్తి చేయాలన్నారు. కాలనీలు బస్తీలలో విద్యుత్ వీధి దీపాల నిర్వహణ గాలికి వదిలేసారని, దీనివల్ల రాత్రి వేళలో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మిగిలిపోయిన సీసీ రోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఆయా డివిజన్ల వారీగా సమస్యలతో కూడిన వినతి పత్రాలను కమిషనర్ కు అందజేశారు.

వెంటనే కమిషనర్ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు ఫోన్ చేసి పూర్తి వివరాలను అందజేయాలని,పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తానని, వారం రోజుల్లో విద్యుత్ వీధి దీపాల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### అదనపు అంతస్తులను సీజ్ చేయాలి

కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాల పేరుతో సుమారు 44 భవనాలను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారని, నిబంధనలను అతిక్రమించి నిర్మించిన ఫ్లోర్లను మాత్రమే సీజ్ చేయాలని ఎమ్మెల్యే కృష్ణారావు కోరారు. ఏ నియోజకవర్గంలో లేనివిధంగా కూకట్‌పల్లిలో నిర్మాణ భవనాలను సీజ్ చేయడం సరికాదన్నారు. పక్క నియోజకవర్గంలో జీరో అనుమతితో భవనాలు నిర్మిస్తున్న పట్టించుకోవడంలేదని, కూకట్‌పల్లిలో మాత్రం అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పందించిన కమిషనర్ జోనల్ కమిషనర్‌తో మాట్లాడి అనుమతి లేని ఫ్లోర్లను మాత్రమే సీజ్ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

### బీఆర్ఎస్ నేత శంభీపూర్ కృష్ణ



కార్యకర్తలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న శంభీపూర్ కృష్ణ

దుండిగల్, మే 16 : కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మున్సిపాలిటీ పరిధి శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీల సభ్యులు శంభీపూర్ కృష్ణను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించడంతోపాటు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కృష్ణ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 16: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శుక్రవారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజి 13, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యారెట్ 27, కాలీఫ్లవర్ 23, దొండ 25, చిక్కుడు 55, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 25, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీరా 18, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 75, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 18, చింతకాయ, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ 9నుంచి 11, చామగడ్డ 31, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 28, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు(12) 60 నుంచి 70, మునగకాయ(1)5 నుంచి 6, పచ్చి బఠాని, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 140, చింతపండు 160, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## డెంగ్యూ పై అవగాహన అవసరం



డెంగ్యూ అవగాహన ర్యాలీలో ఎంటమాలజీ సిబ్బంది

కేపీహెచ్‌బీ కాలనీ, మే 16 : డెంగ్యూను నివారించాలంటే దోమలను నియంత్రించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మూసాపేట సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజీ సోనీ ప్రజలను కోరారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిల్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో జనతానగర్ బస్తీలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిశుభ్ర పరిసరాలలో ఈగలు వృద్ధి చెందుతాయని, దోమలతో డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే లార్వాదశలోని దోమలను నియంత్రించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంటామాలజీ సూపర్వైజర్లు పి.మహేందర్ రెడ్డి, పి.ఉదయ్‌కుమార్, యాదిలాల్, ఎంటమాలజీ సిబ్బంది ఉన్నారు.

## కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : రామకృష్ణ



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న దృశ్యం

కొండాపూర్, మే 16: సర్వేంద్రియానం నయనం ప్రధానం అనే మంచి ఆహారపు అలవాట్లతో కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని కొండాపూర్ టీజీఎస్పీ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం బెటాలియన్‌లో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచి త నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ నేత్రాలు అతి ముఖ్యమైన సున్నితమైన అవయవమని అన్నారు. సిబ్బంది మంచి ఆహారపు అలవాట్లతో కంటిచూపు కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పోలీస్ ఉద్యోగంలో కంటి చూపు పాత్ర చాలా ముఖ్యంమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ బీవీ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ రాంబా బు, ఏం.పార్థసారధి రెడ్డి, నాగ భూషణం, యూనిట్ డాక్టర్ జ్యోతి బాపులే, అగర్వాల్ హాస్పిటల్ డాక్టర్స్ వెంకట్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి... ముఖ్యమంత్రి సహాయనిధి




బాధిత కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు

కుత్బుల్లాపూర్, మే 16: సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిధిగా మారుతుందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్పొరేటర్లు అన్నారు. శుక్రవారం చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరు అయిన సుమారు రూ.27 లక్షల విలువగల 78 చెక్కులను పలు డివిజన్లకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా మా నాయకులు, బీఆర్ఎస్ పార్టీ వీప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని, ఆపదలో ఉన్న ఎంతోమంది నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధిని మంజూరు చేయించి నిరుపేదల ఆత్మబంధువుగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, రషీదా మహమ్మద్ రఫీ, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, ఎర్వ శంకరయ్య, పోలే శ్రీకాంత్, సూరారం డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, సీనియర్ నాయకులు అడ్వకేట్ కమలాకర్ ,ఇబ్రహీం ఖాన్, నవాబ్ భాయ్, కుంట సిద్ధిరాములు, గుబ్బల లక్ష్మీనారాయణ, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, కాలే నాగేష్, ఎల్లాగౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య యాదవ్, నదీమ్‌రాయ్, ఇస్మాయిల్, యేసు, సుధాకర్, అఖిల్, బస్వరాజ్, ప్రభాకర్ గుప్తా, విజయ్ హరీష్, గణేష్, బాల మల్లేష్, బొంబాయి శ్రీను, చిన్న, మహిళా నాయకురాలు పద్మ, సుధ, లబ్ధిదారుల కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధిని అర్హులు వినియోగించుకోవాలి

### నిజాంపేట్ కార్పొరేషన్ బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్



లబ్ధిదారుడు ఆనంద్‌కు ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ప్రవీణ్ గౌడ్, చెన్నకేశవ్

దుండిగల్,మే16: సీఎం సహాయనిధి పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు ప్రవీణ్ గౌడ్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లి, రాజీవ్‌గాంధీనగర్ వాసి బోరంచ ఆనంద్ అనారోగ్యానికి గురికావడంతో వైద్యశాలలో చికిత్స చేయించుకునే స్థోమత లేకపోవడంతో ఆయన ఆర్థికంగా ఆదుకోవాలని ప్రవీణ్ గౌడ్‌ను సంప్రదించగా ఆయన విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయనిధి ద్వారా రూ. 3లక్షల విలువచేసే ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. సంబంధిత ప త్రాన్ని ప్రవీణ్ గౌడ్ లబ్ధిదారుడు ఆనంద్ నివాసానికి వెళ్లి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు చెన్నకేశవ్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం

- అధికార పార్టీ నేతలు చెబితేనే..
- పనులు ముందుకు సాగడమేంటి..?
- అధికారుల నిర్లక్ష్యంపై సీపీఐ ధర్నా



గాజులరామారం సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కుత్బుల్లాపూర్, మే 16: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని సీపీఐ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల కార్యాలయం పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేకుండా పరిమితికి మించిన భవనాలను నిర్మిస్తున్నారని, అదే విధంగా వర్షాకాలంలో వర్షపునీరు రోడ్డుపై వరదలు పారకుండా డ్రైనేజీలను నిర్మించాలని సీపీఐ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం ఫిర్యాదు చేస్తే ఇప్పటివరకు దానిపైన మున్సిపల్ అధికారులు స్పందించలేదని, మున్సిపల్ అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో జంట సర్కిళ్ల కార్యాలయం ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యకర్తలు మాట్లాడుతూ జంట సర్కిళ్ల కార్యాలయం పరిధిలో అనేక సమస్యలు ఉన్నాయని, అదేవిధంగా అనుమతులు లేకుండా ప్రభుత్వ పరిమితికి మించి భవనాలను కడుతున్నారని, రోడ్డును ఆక్రమిస్తూ భవనాలను కడుతున్నారని పేర్కొన్నారు. జగద్గిరిగుట్టలో రోడ్డు వెడల్పు అయినప్పటికీ అక్కడ పార్కింగ్‌కు ఉపయోగపడుతుంది. కానీ వాహనదారులకు ఉపయోగపడట్లేదని అన్నారు. రెండు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు ఇస్తే దానిపై ఇప్పటివరకు ఒక్క అధికారి కూడ స్పందించలేదని, అదే అక్రమ నిర్మాణాలపై కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేస్తే అది అక్రమం కానప్పటికీ మున్సిపల్ అధికారులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటనలు అనేకమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల కోసం సీపీఐ ఉద్యమిస్తే సానుకూలంగా సామరస్యంగా సమస్యను పరిష్కరించాలి కాని ఉద్యమిస్తున్న వారి పైన అనవసర మాటలు మాట్లాడవద్దని అన్నారు. ఇప్పటికైనా సీపీఐ ఇచ్చినటువంటి ఫిర్యాదులను పరిష్కరించాలని లేదంటే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు స్వామి, హరినాథ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాస్, మండల నరసింహారెడ్డి, కోశాధికారి సదానంద్, కార్యదర్శులు కే.వెంకటేష్, సహదేవ రెడ్డి, యాదగిరి, సాయిలు, యూసుఫ్, రాజు, శ్రీనివాస్ చారి, ఇమామ్, సామిల్, ప్రభాకర్, భీమేష్, సంతోష్, రాంరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

శేరిలింగంపల్లి, మే 16: గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రాయదుర్గం సర్వే నెంబర్ 83 లోని నాలెడ్జిసిటీ ప్రాంతం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం రాత్రి 2.30 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతుండగా ఓ వాహనం ఢీ కొట్టిందని, సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతిని వయస్సు 35 నుంచి 40 సంవత్సరాలు ఉండవచ్చని భావిస్తున్నారు. సమీప ప్రాంతాలలో నిర్మాణ సంస్థల్లో పని చేసే కూలీ అయి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ మొబైల్ హెడ్ కానిస్టేబుల్ నర్సింహ్మ ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతిని ఆచూకీ తెలిసిన వారు 83310–13199, 87126–63121 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## నాలా పూడికతీత పనులు నిర్వహించాలి

బాలానగర్, మే 16 : నాలా పూడికచేత పనులను సమగ్రంగా నిర్వహించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ లో నిర్వహిస్తున్న నాలా పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ నాలాలో పూడికతీత సమగ్రంగా చేయాలని లేనిపక్షంలో ముంపు సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలోనే జీహెచ్ఎంసీ అధికారులు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాధాకృష్ణ, శశిధర్, సురేందర్ నాయుడు పాల్గొన్నారు.